అన్నదాతను ఆదుకోవాలి: సిపిఎం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

మిచౌంగ్ తుపాను వల్ల నష్టపోయిన రైతు, కౌలురైతులను ప్రభుత్వం ఆదుకోవాలని, నష్ట పరిహారం రూ.20 వేలు చెల్లించాలని సిపిఎం మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శనివారం పెదగరువు, తుందుర్రు, బేతపూడి, తాడేరు గ్రామాల్లో ఆ పార్టీ బృందం పర్యటించింది. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ధాన్యం తేమతో సంబంధం లేకుండా కొనుగోలు చేయాలని, బరకాలు, గోనె సంచులు సరఫరా చేయాలని కోరారు. వాస్తవ కౌలుదారులకే నష్టపరిహారం చెల్లించాలని, దాళ్వాకు విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు సబ్సిడీపై అందించాలని డిమాండ్ చేశారు.

కష్టాల సుడిలో కౌలురైతులు

మిచౌంగ్ దెబ్బకు విలవిల - ఎకరాకు 28 నుంచి 38 బస్తాలే దిగుబడి - ఎకరాకు రూ.13 వేలకుపైగా అప్పు - పరిహారం అందని పరిస్థితి

ప్రజాశక్తి - భీమవరం

ప్రభుత్వ నిర్లక్ష్యం.. ప్రకతి ప్రకోపం ఫలితంగా కౌలురైతులు విలవిల్లాడుతున్నారు. ఆరు నెలలు కష్టపడి సాగు చేస్తే పంట చేతికొచ్చే సమయంలో తుపాన్ తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. అప్పు చేసి సాగు చేస్తుంటే కష్టానికి సైతం ప్రతిఫలం దక్కక అప్పులే మిగులుతున్న పరిస్థితులు ఉన్నాయి. పెట్టుబడి ఖర్చు, ప్రభుత్వ నిబంధనలు, పంటకు కౌలు చెల్లింపు పోను తిరిగి రూ.10 వేల నుంచి రూ.13 వేల వరకు అప్పు మిగులుతున్న పరిస్థితి ఉంది. దీంతో కౌలురైతుల పరిస్థితి అత్యంత దయనీయంగా తయారైంది. ప్రభుత్వం చెబుతున్న మాటలకు, క్షేత్రస్థాయిలో పరిస్థితులకు పొంతన లేకపోవడంతో కౌలు రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

తుపాన్ నేపథ్యంలో కురిసిన భారీ వర్షాలు వ్యవసాయ రంగాన్ని అతలాకుతలం చేశాయి. సాగులో సుమారు 70 శాతానికిపైగా ఉన్న కౌలురైతులపై మిచౌంగ్ తుపాన్ తీవ్ర ప్రభావాన్ని చూపింది. జిల్లాలో 2.11 లక్షల ఎకరాల్లో ఈ ఏడాది సార్వా సాగు చేపట్టారు. సుమారు 34 వేల ఎకరాల్లో వరిపంట తుపాన్ ప్రభావానికి గురైందని జిల్లా కలెక్టర్ ప్రశాంతి ఇటీవల ప్రకటించారు. అయితే సుమారు 65 వేల ఎకరాలకుపైగా విస్తీర్ణంలో పంటకు నష్టం వాటిల్లినట్లు ఒక అంచనా. వరి చేలు నీట మునగడం, పంట నేలమట్టం కావడం, పడిపోయిన పంట కుళ్లిపోవడం, ధాన్యం మొలకలు రావడం, కోత కోసిన వరి పనలు నీటిలో నానడం.. ఇలా వేలాది ఎకరాల్లో పంట దెబ్బతింది. దీంతో కౌలు రైతులు పూర్తిగా నష్టపోయారు. ఈ నేపథ్యంలో కౌలు రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పంట అంతా నీటి పాలవ్వడంతో పెట్టుబడులు మాటెలాగున్నా తిరిగి అప్పుల పాలవుతున్న పరిస్థితి నెలకొంది. జిల్లాలో సుమారు 2.20 లక్షల మంది రైతులు ఉన్నారు. దీనిలో సుమారు లక్షా 70 వేల మంది కౌలు రైతులు ఉన్నారు. వ్యవసాయాన్ని నూటికి 70 శాతం నుంచి 80 శాతం మంది కౌలు రైతులే చేస్తున్నారు. పంటలు పండించడంలో కౌలురైతులు కీలక పాత్ర పోషిస్తున్నారు. అయితే ప్రభుత్వం కౌలురైతుల పట్ల నిర్లక్ష్యం వహిస్తోంది. కౌలురైతులను పూర్తిస్థాయిలో పట్టించుకునే దాఖలాలు లేవు. జిల్లాలో 87 వేల మందికి మాత్రమే కౌలుగుర్తింపు కార్డులు అందించి మిగిలిన వారికి మొండి చెయ్యి చూపారు. దీనికి సవాలక్ష కారణాలు చెబుతూనే కౌలు రైతుల సమస్యలు పరిష్కరించడంలో తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. దీంతో ప్రకృతి విపత్తులు పంపించిన సమయంలో కౌలురైతులు నష్టపోతున్న పరిస్థితి ఉంది.

అంతంతమాత్రంగానే దిగుబడి

సార్వా పంట దిగుబడులు అంతంతమాత్రంగానే ఉన్నాయి. దీనికితోడు తుపాను ప్రభావం కూడా ఉండటంతో ఆశించిన మేర దిగుబడి రాలేదు. ఎకరాకు 28 నుంచి 38 బస్తాలు మాత్రమే దిగుబడులు వచ్చాయి. 40 బస్తాలు దిగుబడి వచ్చినవారు కేవలం ఒకటి, రెండు శాతం మందే ఉన్నారు. నూటికి 35 బస్తాలు దిగుబడి వచ్చిన రైతులు 20 శాతం, 30 బస్తాలు దిగుబడి వచ్చిన వారు 50 శాతం, కేవలం 20 బస్తాలు దిగుబడి వచ్చిన వారు 30 శాతం మంది ఉన్నారు. అయితే ప్రభుత్వం మద్దతు ధర 75 కేజీల బస్తాకు రూ.1637 ఇస్తుంది. రూ.137 వివిధ ఖర్చులకుపోను 75 కేజీల ధాన్యానికి రూ.1500 మాత్రమే రైతులకు అందుతోంది.

కౌలు రైతులకు ఎకరాకు రూ.13 వేలు వరకూ అప్పు

అప్పు చేసి వ్యవసాయం చేస్తున్నా కౌలు రైతు తిరిగి అప్పుల పాలవుతున్న పరిస్థితి అందిస్తోంది. ఎన్నో ఆశల మధ్య సార్వా పంట చేపడితే కష్టంతోపాటు రూ.10 వేల నుంచి రూ.13 వేలు వరకూ అప్పుల పాలవుతున్నారు. తుపాన్ ప్రభావంతో ధాన్యం తడిచి ఎకరాకు ఐదు నుంచి ఎనిమిది బస్తాల వరకు మొలకలు రావడంతో ఎకరానికి రూ.8 వేల నుంచి రూ.10 వేల వరకు నష్టపోయారు. ధాన్యం కొనుగోలులో వివిధ నిబంధనల పేరుతో ఎకరాకు మరో రూ.3 వేల నుంచి రూ.4500 వరకు కోత విధిస్తున్నారు. ప్రాంతాన్ని బట్టి రెండు పంటలకు కలిపి 20 బస్తాల నుంచి 35 బస్తాల వరకు కౌలు చెల్లించాల్సి ఉంటుంది. దీనికి ఈ సార్వా సీజన్‌లో కనీసం 15 బస్తాలకు రూ.22,500 చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఎకరానికి సుమారు రూ.35 వేల వరకూ పెట్టుబడి ఖర్చవుతోంది. అంటే సుమారు రూ.65 వేల వరకూ ఖర్చవుతోంది.

ఎకరం ధాన్యం అమ్మితే కేవలం రూ.45 వేల నుంచి రూ.55 వేలు వరకు కౌలురైతులకు వస్తుంది. దీన్నిబట్టి చూస్తే ఎకరాకు రూ.10 వేల నుంచి రూ.13 వేల వరకు కౌలురైతులు ఈ ఏడాది సార్వాలో అప్పుల పాలవుతున్న దుస్థితి ఉంది. ఆరు నెలలపాటు కష్టపడి పంట పండిస్తే తిరిగి అప్పుల పాలు కావడంతో కౌలురైతులు సాగు వదిలి కూలీలుగా మారుతున్నారు.

ధాన్యాని పుంతగట్లపై ఆరబెట్టుకుంటున్న రైతులు

ఎకరాకు రూ.28 వేల నుంచి రూ.35 వేలు పెట్టుబడి

ఈ ఏడాది సార్వా పంటకు ఎకరాకు రూ.28 వేల నుంచి రూ.35 వేల వరకు పెట్టుబడులు పెట్టారు. వరి చేను దమ్ము చేసేందుకు రూ.3,500, విత్తనాలు నారుమడులు పోసేందుకు రూ.రెండు వేలు, బాగుజేతకు రూ.వెయ్యి, ఆకుతీత, నాట్లకు రూ.5 వేలు, ఎరువులు, పురుగుమందులకు రూ.10 వేలు, వీటిని చల్లేందుకు కూలీలకు రూ.2 వేలు, కలుపుతీత, ఎలుకలు కొట్టేందుకు రూ.2 వేలు, మాసూళ్లకు రూ.5 వేలు, ఇంజిన్లతో సాగునీరు తోడుకునేందుకు రూ.4 వేలు, ధాన్యం రాశి కప్పేందుకు రూ.2 వేలు చొప్పున పెట్టుబడి పెట్టారు.

నిబంధనలు సడలించి ధాన్యం కొనుగోలు చేయాలి

మామిడిశెట్టి రామాంజనేయులు, కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి

కౌలు రైతుల పరిస్థితి దారుణంగా ఉంది. రకరకాల సమస్యలతో సతమతమవుతున్నారు. ప్రభుత్వాలు పట్టించుకోవట్లేదు. అయినా అప్పు చేసి సాగు చేస్తుంటే కనీసం అప్పు సొమ్ము కూడా రావడం లేదు. తుపాన్ ప్రభావంతో వరి రైతులు అన్ని విధాలా నష్టపోయారు. వరి చేలు నేలమట్టమయ్యాయి. వరి పనలు నీటిలో నానుతున్నాయి. ధాన్యం రాశులు తడిచి ముద్దయ్యాయి. మొలకలు కూడా వచ్చాయి. ధాన్యం అమ్ముకునేందుకు రైతుభరోసా కేంద్రాలకు వెళ్తుంటే తేమ ఎక్కువగా ఉందని చెబుతున్నారు. ప్రభుత్వం నుంచి తడిచిన ధాన్యాన్ని కొనాలని తమకు ఆదేశాలు రాలేదని చెబుతున్నారు. చివరకు రైస్‌మిల్లు దగ్గరికి ధాన్యం తోలుతుంటే అక్కడ ధాన్యానికి ఎంత ధర ఇస్తారో కూడా చెప్పట్లేదు. ప్రభుత్వం చెప్పేదానికి, క్షేత్రస్థాయిలో పరిస్థితులకు ఏమాత్రం పొంతన లేదు. నిబంధనలు సడలించి తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేసి కౌలు రైతులను ఆదుకోవాలి.

అప్పులే మిగులుతున్నాయి

కవురు సత్యనారాయణ, కౌలురైతు, ఉనికిలి, అత్తిలి మండలం

నేను ఎనిమిదెకరాలు కౌలుకు చేస్తున్నాను. సుమారు రూ.2.70 లక్షల వరకు పెట్టుబడి పెట్టాను. తుపాన్‌కు చేతికొచ్చిన పంట నీటి పాలైంది. ధాన్యం అమ్మకానికి నిబంధనలు పెట్టి కోతలు విధిస్తున్నారు. సార్వా పంట అంతా నష్టమే వచ్చింది. చివరికి అప్పులే మిగులుతున్నాయి. ప్రభుత్వం స్పందించి నష్టపరిహారాన్ని అందించి ఆదుకోవాలి.

అన్ని విధాలా నష్టపోయాం

కె.ఆంజనేయులు, మల్లవరం లంక, కౌలురైతు, నరసాపురం మండలం

ఎన్నోఏళ్ల నుంచి కౌలుకు వ్యవసాయం చేసుకుంటూ కుటుంబమంతా జీవనం సాగిస్తున్నాం. తుపాన్ వల్ల అన్ని విధాలా నష్టపోయాం. ఎకరానికి రూ.28 వేల రూ.32 వేల వరకు పెట్టుబడి అయ్యింది. దిగుబడి ఆశించినంత రాలేదు. పెట్టుబడి అయిన దానికి ధాన్యం అమ్మగా వచ్చిన సొమ్ముకు పొంతన లేదు. దీంతో తిరిగి అప్పుల పాలవుతున్నాం.

మాట్లాడుతున్న ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణరావు

ఒపిఎస్ ఊసెత్తని జగన్

ఉద్యోగ, ఉపాధ్యాయుల పట్ల నిర్లక్ష్యం తగదు

నాలుగున్నరేళ్లలో ఒక్క డిఎస్‌సి కూడా ప్రకటించని పరిస్థితి

25 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ

తిరోగమనం వైపు విద్యారంగ సంస్కరణలు

యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల ప్రారంభంలో నేతలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేస్తామన్న సిఎం జగన్ ఉద్యోగ, ఉపాధ్యాయులను ఘోరంగా మోసగించారని, నేడు ఆ ఊసెత్తడం లేదని ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణ్‌రావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సంస్కరణల పేరుతో విద్యారంగాన్ని తిరోగమనంవైపు తీసుకెళుతుందని, ప్రాథమిక విద్యను బతికించేందుకు ఉపాధ్యాయులు కదలి తల్లిదండ్రులతో కలిసి సామాజిక ఉద్యమాన్ని నిర్మించాలని ఆయన పిలుపునిచ్చారు. యుటిఎఫ్ రాష్ట్ర 49వ కౌన్సిల్ సమావేశాలు శనివారం స్థానిక మినీ బైపాస్‌రోడ్‌లోని చలసాని గార్డెన్స్‌లో ప్రారంభమయ్యాయి. ముందుగా స్థానిక కెనాల్ రోడ్‌లోని యుటిఎఫ్ కార్యాలయం వద్ద ర్యాలీని ఎంఎల్‌సి షేక్ సాబ్జీ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ర్యాలీ మున్సిపల్ కార్యాలయం, పాతబస్టాండ్, వసంతమహల్ సెంటర్, ఓవర్ బ్రిడ్జి, కొత్తబస్టాండ్, సత్రంపాడు మీదుగా చలసాని గార్డెన్స్ చేరుకుంది. అనంతరం సభా ప్రాంగణంలో స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జెండాను సాబ్జీ, యుటిఎఫ్ జెండాను యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్క వెంకటేశ్వర్లు, జాతీయ జెండాను పూర్వపు రాష్ట్ర కార్యదర్శి జయప్రభ ఆవిష్కరించారు. అనంతరం యుటిఎఫ్ అమరవీరుల స్థూపానికి నివాళు లర్పించారు. అనంతరం జరిగిన ప్రారంభ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించి మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఈ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో రిటర్న్ గిఫ్ట్ ఇస్తామన్నారు. అనంతరం ఎంఎల్‌సి లక్ష్మణరావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల నియామకాలకు ఒక డిఎస్‌సి కూడా విడుదల చేయని ప్రభుత్వం ఈ వైసిపి అని అన్నారు. అధికారంలోకొచ్చిన వారం రోజుల్లో సిపిఎస్‌ను రద్దు చేసి పాతపెన్షన్ విధానం అమలు చేస్తానన్న సిఎం జగన్ మాట తప్పి జిపిఎస్ ప్రకటించడం సరికాదన్నారు. 25 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉంటే వాటిని భర్తీ చేయకుండా నాణ్యమైన విద్య ఎలా సాధ్యమో చెప్పాలన్నారు. పాఠశాలల విలీన ప్రక్రియ ద్వారా విద్యారంగం తీవ్రంగా నష్టపోతుందని, విద్య చుట్టూ సామాజిక ఉద్యమాలు నిర్మించడం ద్వారానే విద్యారంగ సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్.ప్రసాద్ కౌన్సిల్లో చర్చించే అంశాలు సమావేశానికి తెలియజేస్తూ ప్రభుత్వ పాఠశాలలను బతికించుకోవడానికి యుటిఎఫ్ బహుముఖ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ అంశాన్ని రాజకీయ ఎజెండాగా మార్చనున్నట్లు 'ఓట్ ఫర్ ఒపిఎస్' నినాదంతో విస్తతంగా ప్రజల్లోకి వెళ్తున్నట్లు తెలిపారు. దీర్ఘకాలంగా ఉపాధ్యాయులకు పిఆర్‌సి, పిఎఫ్, ఎపిజిఎల్ఐ, సరెండర్ లీవు బకాయిలు రూ.20 వేల కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని, ఈ ఆర్థిక బకాయిల సాధనకు కార్యాచరణ చేపట్టనున్నట్లు తెలిపారు. ఎంఎల్‌సి, యుటిఎఫ్ పూర్వపు రాష్ట్ర అధ్యక్షులు ఐ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ యుటిఎఫ్ రాష్ట్రంలో అతిపెద్ద ఉపాధ్యాయ ఉద్యమాన్ని నిర్మించిందన్నారు. 49 సంవత్సరాలు పూర్తిచేసుకుని స్వర్ణోత్సవాలకు సిద్ధమవుతుందని తెలిపారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించకూడదంటూ నిర్బంధాలకు పూనుకుంటున్నారని, నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరన్నారు. పాఠశాల విద్యారంగాన్ని ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించని ప్రభుత్వాలు ఏ విధంగా కనుమరుగయ్యాయో చరిత్ర చెబుతుందని విమర్శించారు. ఎంఎల్‌సి షేక్ సాబ్జీ మాట్లాడుతూ ఎన్‌జిపి-2020 పేరుతో దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా విద్యా రంగంలో విధ్వంసాన్ని రాష్ట్ర ప్రభుత్వం సృష్టిస్తుందన్నారు. ప్రాథమిక పాఠశాల విద్యా వ్యవస్థను విచ్ఛిన్నం చేస్తూ ప్రాథమిక పాఠశాలలను ఉన్నత పాఠశాల్లో విలీనం చేయడంతో వేలాది పాఠశాలలు మూతపడ్డాయన్నారు. మాతృభాష బోధన మాధ్యమంగా లేని విధంగా ఈ రాష్ట్రాన్ని తయారుచేశారన్నారు. ఆంగ్ల మాధ్యమానికి సమాంతరంగా తెలుగు మాధ్యమం ఉండాలన్నారు. జిల్లా జెవిసి ఛైర్మన్ చోడగిరి శ్రీనివాసరావు ప్రసంగిస్తూ ఉపాధ్యాయ వృత్తిని కించపరిచే విధంగా ఈ రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించడం దుర్మార్గమన్నారు. ఒకటో తేదీన జీతాల కోసం ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎదురుచూసేలా చేయడం ప్రభుత్వానికి సిగ్గుచేటని విమర్శించారు. ప్రజలతో కలిసి ఓటు హక్కు ద్వారా ఈ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుదామన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి శ్యామ్‌సుందర్ మాట్లాడుతూ మెరుగైన సమాజం నిర్మించడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని, విద్యార్థుల్లో కమ్యూనికేషన్ స్కిల్స్, పాజిటివ్ థింకింగ్, మానవ విలువలు పెంపొందించాలని సూచించారు. ఉపాధ్యాయుల సమస్యల పట్ల తాను సానుకూలంగా ఉంటానని ఉపాధ్యాయులు తనను ఎప్పుడైనా నేరుగా కలవొచ్చని తెలిపారు. ఈ సమావేశంలో సిఐటియు నాయకులు ఆర్.లింగరాజు, రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కొమ్మోజు శ్రీనివాస్, సహాధ్యక్షులు సురేష్ కుమార్, కోశాధికారి గోపిమూర్తి, రాష్ట్ర కార్యదర్శులు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రవికుమార్, ముస్తఫా ఆలీ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జుత్తిగ నరసింహమూర్తి

జగన్ ఇచ్చిన హామీలు అమలు చేయాలి

ఎపి కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జుత్తిగ నరసింహమూర్తి

23న కల్లుగీత కార్మిక సంఘం జిల్లా మహాసభ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

జగన్మోహన్‌రెడ్డి పాదయాత్రలో కల్లుగీత కార్మికులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జుత్తిగ నరసింహమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో ఆ సంఘ నాయకులు మామిడిశెట్టి నాగభూషణం అధ్యక్షతన సంఘ సమావేశం జరిగింది. సమావేశంలో నరసింహమూర్తి మాట్లాడుతూ ఈ నెల 23న భీమవరంలో కల్లుగీత కార్మిక సంఘం 31వ జిల్లా మహాసభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. జగన్ తన పాదయాత్ర సందర్భంగా కల్లుగీత కార్మికులకు అనేక హామీలిచ్చారని, అధికారంలోకొచ్చి నాలుగున్నరేళ్లయినా ముఖం చాటేశారని విమర్శించారు. ఎక్స్‌గ్రేషియా రూ.10 లక్షలు ఇస్తానని ఆర్భాటంగా ప్రకటించి సంవత్సరం దాటినా ఇవ్వకుండా గీత కార్మికులకు వైసిపి ప్రభుత్వం అన్యాయం చేసిందన్నారు. ప్రభుత్వం మద్యం ఆదాయం కోసం కల్లుగీత వృత్తిని సర్వనాశనం చేసిందన్నారు. గీతవృత్తి కార్మికుల కోసం ప్రభుత్వం ఈ కాలంలో ఏం చేసిందో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వృత్తిని ఆధునికీకరించి అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. సంఘం జిల్లా అధ్యక్షులు కామన మునిస్వామి మాట్లాడుతూ కరోనా సమయంలో 40 రోజులు కల్లు గీయనీయకుండా ఆంక్షలు విధించి అక్రమ కేసులు బనాయించి గీత కార్మికులను వేధించిన ఈ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామన్నారు. జిల్లా మహాసభలో భవిష్యత్తు కార్యాచరణపై చర్చిస్తామని తెలిపారు. ఈ మహాసభకు ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథిగా విచ్చేస్తారన్నారు. సమావేశంలో నేతలు బొక్కా చంటి, కడలి పాండు, దాసరి సూరిబాబు, బొంతు శ్రీనివాస్, బొక్కా సోమేశ్వరరావు, కాగిత రాధాకృష్ణ, ఆరేపల్లి వెంకట నారాయణ పాల్గొన్నారు.

12న అంగన్వాడీ నిరాహార దీక్ష

ప్రజాశక్తి - తణుకురూరల్

అంగన్‌వాడీల సమస్యలు వెంటనే పరిష్కరించి, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అడ్డగర్ల అజయకుమారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పైడిపర్రులో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఈ నెల 12న చేపట్టనున్న నిరాహారదీక్షల కరపత్రాన్ని ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అజయకుమారి మాట్లాడుతూ ఎన్నికల ముందు నాటి ప్రతిపక్ష నేతగా జగన్మోహన్‌రెడ్డి అంగన్‌వాడీలకు అనేక హామీలు ఇచ్చారన్నారు. తెలంగాణా కంటే ఎక్కువ వేతనం ఇస్తానని చెప్పి నాలుగున్నర సంవత్సరాలైనా నేటికీ అమలుకు నోచుకోలేదని విమర్శించారు. ఈ నెల 12న నిరాహార దీక్షను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో మధు, కనకమహాలక్ష్మి, వెంకటలక్ష్మి, భవాని, విజయ, నందకుమారి, సుబ్బలక్ష్మి, రమాదేవి, ఉషారాణి, అనిత పాల్గొన్నారు.

కరపత్రం ఆవిష్కరించిన నేతలు, అంగన్వాడీలు

రైతులను అన్నివిధాలా ఆదుకోవాలి : పితాని

కుళ్లిన వరిపంటను పరిశీలిస్తున్న పితాని

ఆచంట: భారీ వర్షాలకు దెబ్బతిన్న రైతాంగాన్ని ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకోవాలని టిడిపి నేత, మాజీ మంత్రి పితాని సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆయన మండలంలోని ఆచంట వేమవరం, కోడేరు, కరుగోరుమిల్లి, పెనుమంచిలి గ్రామాల్లో భారీ వర్షాలకు దెబ్బతిన్న చేలను పరిశీలించారు. ఈ సందర్భంగా పితాని మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో భారీ వర్షాలకు చేలు నేలకొరిగాయని, రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. నష్టపోయిన రైతులకు ఆర్థిక సాయంతోపాటు ఇన్సూరెన్స్ చెల్లించాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట జెడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్‌బాబు, ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి, టిడిపి మండల అధ్యక్షుడు కేతా మీరయ్య, నేతలు బోడపాటి దుర్గాప్రసాద్, కేతా మురళి, బికెడి.ప్రసాద్ పాల్గొన్నారు.

ఆచంట (పెనుమంట్ర): తుపాన్‌కు రైతులు తీవ్రంగా నష్టపోయారని, వారిని ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ మంత్రి, టిడిపి నేత పితాని సత్యనారాయణ డిమాండ్ చేశారు. ముంపునకు గురైన ఆలమూరు, పొలమూరు , బ్రాహ్మణచెరువు , మాముడూరు, మార్టేరుల్లో పంట పొలాలను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నేతలు వెంకట్రాజు, బులిరామిరెడ్డి, రవి రాజు, మాజీ ఎఎంసి ఛైర్మన్ గోపాలకృష్ణ,రామకృష్ణ, పొలమూరు జనసేన నాయకులు వెంకన్న, వివేక్ పాల్గొన్నారు.

ప్రభుత్వం ఆదుకుంటుంది

వైసిపి నేత గుడాల గోపీ

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

కుళ్లిన వరిపంటను పరిశీలిస్తున్న గోపీ

తుపాన్ బాధితులను ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల శ్రీహరిగోపాలరావు (గోపీ) తెలిపారు. మండలంలోని తిల్లపూడి పంచాయతీ పాతగరువులో నీట మునిగిన పంట పొలాలను, తడిచిన ధాన్యపు రాశులను, దెబ్బతిన ఇళ్లను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గోపీ మాట్లాడుతూ నష్టపోయిన ప్రతిరైతునూ ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. ఆయన వెంట నేతలు విప్పర్తి ప్రభాకర్, గుమ్మాపు పెద్దిరాజు, ఏనుగుపల్లి చంద్రశేఖర్, అశోక్‌రాజు, నడపన కృష్ణమూర్తి, నడపన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తుపాను నేర్పిన పాఠాలెన్నో..!

మిచౌంగ్ తుపాను ఉమ్మడి జిల్లాను అతలాకుతలం చేసింది. ఈదురుగాలులు, ఎడతెరిపి లేని వర్షం, ఆపై సుడిగాలులు జిల్లావాసులను కష్టాల పాల్జేశాయి. వరి, ఇతర పంటలు నీట మునిగి రైతులు తీవ్ర నష్టాల పాలయ్యారు. సుడిగాలి పెద్దఎత్తున ఆస్తి నష్టాన్ని మిగిల్చింది. సామూహిక కల్లాలు లేక రైతులు పుంతగట్లు, పొలాల్లోనే ధాన్యాన్ని ఉంచడంతో అది తడిసి ముద్దయ్యింది. వర్షాలు తగ్గాక అయినా నీరు తగ్గకపోవడంతో ధాన్యాన్ని ఎక్కడ ఆరబెట్టుకోవాలో తెలియక రైతులు తలలు పట్టుకుంటున్నారు. సామూహిక కల్లాల ఏర్పాటులో ప్రభుత్వ నిర్లక్ష్యం తుపాను సందర్భంగా రైతుల పాలిట శాపంగా మారిందనడంలో అతిశయోక్తి లేదు.

తుపాను తర్వాత ప్రతి రైతునూ ఆదుకుంటాం.. అంటూ ఇటు అధికార పార్టీ ప్రజాప్రతినిధుల దగ్గర నుంచి అధికారుల వరకూ అంతా ఒకే పల్లవి అందుకున్నారు. ప్రధానంగా తడిసిన ధాన్యాన్ని నిబంధనలతో సంబంధం లేకుండా తమకు దగ్గర్లోని ఇష్టమొచ్చిన రైస్‌మిల్లుకు తరలించుకోవచ్చని ప్రకటనలు గుప్పించారు. వర్షాలు తగ్గాక తడిసిన ధాన్యాన్ని తేమ శాతంతో సంబంధం లేకుండా కొనుగోలు చేస్తున్నట్లు సైతం ప్రకటించారు. దీంతో రైతులు నీట మునిగిన ధాన్యాన్ని గట్టుకు చేర్చి హుటాహుటీన మాసూళ్లు పూర్తి చేసి అమ్మకానికి సిద్ధం చేశారు. అయితే అసలు కథ ఇక్కడే ప్రారంభమైంది. ప్రజాప్రతినిధులు, అధికారులవన్నీ ఉత్తుత్తి ప్రకటనలేనని, తడిసిన ధాన్యం కొనుగోలుకు ఆదేశాలే రాలేదని అటు ఆర్‌బికె అధికారులు, ఇటు మిల్లర్లు తేల్చేశారు. ఒకవేళ మిల్లుకు తీసుకెళ్లినా బస్తాకు ఎంతోకొంత సొమ్ము కోతగాని లేదా అదనపు ధాన్యంగాని తూయాల్సి వస్తుండటంతో రైతులు నివ్వెరపోయారు. అధికారులు సైతం అనధికారికంగా మిల్లర్లకే వత్తాసు పలుకుతుండటంతో రైతులు నోరుమెదపలేని పరిస్థితి ఏర్పడింది. ఈ విషయం తెలిసిన రైతులు ఇన్ని కష్టాలూ పడి మిల్లర్ల వద్దకు వెళ్లి సొమ్ము కోసం వేచి ఉండటం ఎందుకని దళారులకే అమ్మడం ప్రారంభించారు. దీంతో ధాన్యం అమ్మకాల్లో ప్రభుత్వమే దళారులను ప్రోత్సహించినట్లయిందని రైతునేతలు చెబుతున్నారు. మరి నిబంధనలు సడలించామని ఊకదంపుడు ప్రకటనలు గుప్పించిన మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు దీనిపై నోరు మెదపకపోవడం అందరినీ విస్మయపరుస్తోంది.

ఇక భారీ వర్షాలు తగ్గి బుధవారం నుంచి కొంత పొడివాతావరణం నెలకొంది. గురువారం నుంచి ఎండలు ప్రారంభమయ్యాయి. అయితే డెల్టాలో డ్రెయిన్లను ఆనుకుని ఉన్న చేలల్లో నేటికీ ముంపు నీరు తగ్గకపోవడం, పంట కుళ్లిపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. భారీ వర్షాలు మూడు రోజులే కురిసినా, అంతకుముందు వర్షాభావ పరిస్థితుల రీత్యా ముంపు నీరు డ్రెయిన్లలోకి పారడం పెద్దసమస్య కాదు. అయితే వైసిపి ప్రభుత్వం డెల్టా ఆధునికీకరణను అటకెక్కించి కనీసం డ్రెయిన్లలో పూడికతీత, గుర్రపుడెక్క, తూడు తొలగింపు పనులు చేపట్టకపోవడంతో నీరు దిగువకు ప్రవహించని పరిస్థితి నెలకొంది. దీంతో రోజులు తరబడి పంట నీళ్లల్లో నాని కుళ్లి పనికి రాకుండాపోతుంది. ఇక బరకాలు అందించలేని పరిస్థితి స్పష్టంగా కన్పించింది. తుపానుకు ముందు గోనె సంచులు సైతం అందించలేని ఘటనలు తుపాను తర్వాత బయటపడ్డాయంటే అధికారుల పర్యవేక్షణలో లోపాలను ప్రతిబింబిస్తోంది.

ఇక రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఏలూరు జిల్లాలో శుక్రవారం సుడిగాలి పర్యటన చేశారు. చావుకబురు చల్లగా చెప్పినట్లు మార్చి వరకూ సార్వా ధాన్యం కొనుగోలు చేస్తామని ప్రకటించారు. ధాన్యం కొనుగోలు చేస్తారనేది సానుకూల అంశమే. అయితే తక్షణం కొనుగోళ్లకు ప్రభుత్వం సిద్ధంగా లేదని ఆయన మాటలను బట్టి అర్థమవుతోంది. అంటే తడిసిన ధాన్యం, తేమ శాతం ఎక్కువున్న ధాన్యం ఆరబెట్టిన తర్వాతే కొనుగోలు చేస్తారనేది ఆయన మాటలను బట్టి తెలుస్తోంది. దీన్నిబట్టి ప్రభుత్వం సార్వా ధాన్యం వెంటనే కొనుగోలు చేయకపోతే దాళ్వా సాగుకు పెట్టుబడులు ఎక్కడ నుంచి వస్తాయనేది అధికారులు, ప్రజాప్రతినిధులే చెప్పాలి. పరిహారం ఎంతిస్తారు, ఎప్పుడిస్తారనేదీ చెప్పరు.. ధాన్యం కొనుగోలు చేసి సొమ్ములివ్వరు అంటే దాళ్వా సాగు అటకెక్కినట్లేనని, ఒక విధంగా ప్రభుత్వమే అనధికారికంగా క్రాప్‌హాలిడే ప్రకటించేస్తున్నట్లు ఉందని రైతు నేతలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తడిసిన ధాన్యం కొనుగోలు దగ్గర నుంచి పరిహారం అందజేత వరకూ, అలాగే దాళ్వా సాగుకు విత్తనాల దగ్గర నుంచి అవసరమైన పెట్టుబడికి రుణ సదుపాయం వరకూ త్వరితగతిన చర్యలు చేపడితే రైతులకు ఉపయోగకరం. లేకపోతే వైసిపి, బిజెపి ప్రభుత్వాలు రైతు వ్యతిరేకతను మూటగట్టుకోక తప్పదని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

-విఎస్ఎస్‌వి.ప్రసాద్



సత్తిబాబు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

సత్తిబాబు మృతి తీరనిలోటు

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్

ప్రజాశక్తి - ఆకివీడు

గులిపల్లి సత్యనారాయణ(సత్తిబాబు) మృతి సిపిఎం, డివైఎఫ్ఐ ఉద్యమానికి తీరని లోటని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ అన్నారు. గత నెల 28వ తేదీన అనారోగ్యంతో మరణించిన సిపిఎం కార్యకర్త గులిపల్లి సత్యనారాయణ సంతాప సభ ఆయన నివాసం వద్ద పార్టీ పట్టణ కార్యదర్శి కె.తవిటినాయుడు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. సత్తిబాబు చిత్రపటానికి గోపాలన్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ సత్తిబాబు యువజన కార్యక్రమాలల్లో, పార్టీ ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొనేవారన్నారు. ఆయన భార్య దుర్గ యానిమేటర్‌గా అందరికీ సుపరిచితురాలున్నారు. ఆమె తాను పనిచేసే సంస్థ ద్వారా సమాజానికి, భర్త ద్వారా పార్టీకి ఎన్నో విధాలుగా సహకారం అందిస్తోందన్నారు. సత్తిబాబు కుటుంబానికి పార్టీ అన్ని రకాలుగా అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ శాఖ కార్యదర్శి సందక సూరిబాబు, డోకల లక్ష్మి, డోకల సత్యనారాయణ, డి.రవితేజ, పెంకి అప్పారావు, షేక్ వలి, బి.రాంబాబు, బివి.వర్మ, సందక ఉదయకుమారి, దొడ్డి పద్మ, యర్రా కృష్ణవేణి, డిఎన్‌విడి.ప్రసాద్, బత్తిన అప్పారావు పాల్గొన్నారు.

పాడి పశువులకు టీకాలు

ప్రజాశక్తి - ఆచంట (పెనుమంట్ర)

తుపాన్, వర్షాల వల్ల పశువులకు గొంతు వాపు రాకుండా యాజమాన్యం టీకాలు వేయించాలని పెనుమంట్ర వెటర్నరీ వైద్యాధికారి జి.వరలక్ష్మి అన్నారు. మండలంలోని వెలగలవారిపాలెం, భట్టుమాగుటూరు, పెనుమంట్ర, బ్రాహ్మణచెరువుతో పాటు పలు గ్రామాల్లో సిబ్బందితో టీకాలు వేయించే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వరలక్ష్మి మాట్లాడుతూ సుమారు 180 పశువులకు టీకాలను వేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో తొమ్మిది మంది వెటర్నరీ అసిస్టెంట్లు, పశువు యాజమాన్యం పాల్గొన్నారు.

ఘనంగా పితాని పుట్టినరోజు వేడుక

ప్రజాశక్తి - పాలకొల్లు

మంత్రి పితాని సత్యనారాయణకు ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు, మాజీ ఎంఎల్‌ఎ అంగర రామ్మోహన్ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని కొమ్ముచిక్కాలలోని ఆయన స్వగృహంలో పితానికి పుష్పగుచ్చాలు ఇచ్చి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ రామానాయుడు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో పితాని నేతృత్వంలో ఉమ్మడి జిల్లాలో 15 స్థానాలు టిడిపి, జనసేన కూటమి ఘన విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

పోడూరు : టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీ మంత్రి పితాని సత్యనారాయణ పుట్టినరోజు వేడుకలు శనివారం ఆయన స్వగృహం కొమ్ముచిక్కాలలో ఆ పార్టీ శ్రేణుల ఘనంగా నిర్వహించారు. ఆచంట నియోజకవర్గం నలుమూలల నుంచి పెద్దఎత్తున నాయకులు, కార్యకర్తలు హాజరై శుభాకాంక్షలు తెలిపారు. పాలకొల్లు ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు, మాజీ ఎంఎల్‌ఎ అంగర రామ్మోహనరావు, టిడిపి తణుకు, తాడేపల్లిగూడెం, నరసాపురం ఇన్‌ఛార్జులు పలువల బాబ్జి, ఆరిమిల్లి రాధాకృష్ణ, పొత్తూరి రామరాజు, భీమవరం నాయకులు కోళ్ల నాగేశ్వరరావు, విశ్వ మానవ వేదిక అధ్యక్షులు మల్లుల సురేష్, జ్ఞానేశ్వరి హాజరై ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

మంత్రులకు పిసిసి సభ్యుల అభినందన

ప్రజాశక్తి - పాలకొల్లు

నూతనంగా బాధ్యతలు చేపట్టిన తెలంగాణ రాష్ట్ర మంత్రులను మంత్రుల ఛాంబర్‌లో పాలకొల్లుకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత, పిసిసి సభ్యులు కొలగాని హరికిరణ్ కలిసి అభినందించారు. వీరి సారధ్యంలో రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఎపిలో కూడా కాంగ్రెస్ ప్రభంజనం వీయాలని హరికిరణ్ ఆకాంక్షించారు. కోమటిరెడ్డి వెంకటరెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, సీతక్కలను హరికిరణ్ కలిశారు.

వేంపాడులో 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

ప్రజాశక్తి - కాళ్ల



కార్యక్రమంలో ఎంఎల్‌ఎ రామరాజు, నాయకులు

రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించుకుందామని ఉండి ఎంఎల్‌ఎ మంతెన రామరాజు ప్రజలను కోరారు. మండలంలోని వేంపాడు గ్రామంలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని పార్టీ మండలాధ్యక్షులు జివి.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఉండి ఎంఎల్‌ఎ మంతెన రామరాజు ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు అందించిన అభివృద్ధి పథకాలను వివరిస్తూ, ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. అధికార పార్టీ అరాచకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో అభిరామ్ శారిరాజు, తోట ఫణిబాబు, వెంకట్రావు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా'కు పేర్లు నమోదు చేసుకోండి

ప్రజాశక్తి - ఆచంట (పెనుమంట్ర)

ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి ఈ నెల 13వ తేదీ లోపు 18 నుంచి 60 సంవత్సరాల వయస్సు గల వారు తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఎంపిడిఒ పి.పద్మజ, ఎంఇఒ-2 ఉంగరాల నాగేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి గ్రామానికి పది మంది వాలంటీర్ల చొప్పున ఎంపికచేస్తున్నట్లు తెలిపారు. వాలంటీర్ల వద్ద పేర్లు నమోదు, టోల్ ఫ్రీ నెంబర్ 1902 ఫోన్ చేసి నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ పోటీల్లో వాలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొనరాదని తెలిపారు. ఈ నెల 15వ తేదీ నుంచి గ్రామ స్థాయిలో పోటీలు మండల స్థాయి, నియోజకవర్గ స్థాయి, ఆపై జిల్లా నుంచి రాష్ట్ర స్థాయి వరకు పోటీలు జరుగుతాయని తెలిపారు.

ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయమని, ప్రతిఒక్కరూ మంచి హృదయం కలిగి ఎదుటి వారికి సాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. భీమవరం బస్టాండ్ ఎదురుగా కేపీఆరావు హైస్కూల్ గ్రౌండ్‌లో జివిఐ ఫౌండేషన్, ఎవిఎఫ్ సిటి సంయుక్త నిర్వహణలో శనివారం నిర్వహించిన సేవకుల ఐక్య క్రిస్మస్ వేడుకలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. తొలుత కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఉండి ఎంఎల్‌ఎ మంతెన రామరాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వెల్ఫేర్ ప్రెసిడెంట్ పిడి విల్సన్ ఫాల్, జివిఐ ఫౌండేషన్ ఛైర్మన్ జి.రాజేష్ ఖన్నా, అంతర్జాతీయ ప్రసంగీకులు డాక్టర్ రంగరాజు, జాతీయ అధ్యక్షులు పాస్టర్ పీటర్ పుట్ల, ప్రోగ్రాం కమిటీ ఛైర్మన్ గోగులమండ భవాని పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - మొగల్తూరు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని కొత్తపాలెంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొత్తపాలెం గ్రామానికి చెందిన ఉన్నమట్ల పెద్దిరాజు (37) శనివారం ఇంటి నుంచి నరసాపురం వెళుతుండగా వచ్చారు. సెంటర్ పాయింట్ వద్దకు వచ్చేసరికి అతడిని బొలెరో వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన అతడిని 108కు సమాచారం అందించారు. కుటుంబసభ్యులు, స్థానికులు అతడిని అత్యవసర వాహనంలో నరసాపురం ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. పెద్దిరాజుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య ఉన్నమట్ల రేఖ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈ క్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ విభాగం కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ విభాగం కోసం సెల్: 83339 88814

సమస్యల వలయంలో కాంబొట్లపాలెం

రహదారి సమస్యతో ప్రజలకు నరకయాతన
అసంపూర్తిగా సచివాలయ భవన నిర్మాణం
బిసి కమ్యూనిటీ హాలు, బస్‌షెల్టర్ లేక ప్రజల ఇక్కట్లు
నీటి మూటలుగా ప్రజాప్రతినిధుల హామీలు

అధ్వానంగా ఉన్న ప్రధాన రహదారి

ప్రజాశక్తి - యలమంచిలి

అసంపూర్తిగా సచివాలయ భవనం

మండలంలోని శివారు ప్రాంతమైన కాంబొట్లపాలెం గ్రామ పంచాయతీ సమస్యల వలయంలో చిక్కుకుని సతమతమవుతుంది. ఈ గ్రామంలో అనేక సమస్యలు తాండవిస్తున్నా ప్రజా ప్రతినిధుల చిన్న చూపుతో అభివృద్ధికి ఆమడ దూరంలో నిలుస్తుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా పాలకొల్లు-దొడ్డిపట్ల మెయిన్ రోడ్డు నుంచి సంగటిరేవు, చింతదిబ్బ మీదుగా గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి నిర్మాణానికి గతంలోనే అప్ గ్రేడేషన్ ఆఫ్ ఎన్‌ఆర్‌ఇజిఎస్ (ఎస్‌సిపి) నిధులు రూ.3.20 కోట్ల అంచనాతో రెండేళ్ల క్రితం ప్రభుత్వం ఈ పనులు ప్రారంభించింది. అయితే నిధుల లేమితో కేవలం చింత దిబ్బ గ్రామ సీతమ్మచెరువు వరకే ఈ రహదారి నిర్మాణం జరిగి మిగతా పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. దీంతో ఉన్న కాస్త రహదారి లారీలు, ట్రాక్టర్ రాకపోకలతో పూర్తిగా శిథిలావస్థకు చేరి సుమారు కిలోమీటర్ మేర పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. కనీసం ఈ రహదారిపై ద్విచక్రవాహనాలు సైతం వెళ్లే పరిస్థితి లేదు. గోతుల్లో పడి వాహనదారులు తరచూ అనేక ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న సచివాలయ భవనం సైతం పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ నిధుల కొరతతో పనులను మధ్యలో నిలిపివేయడంతో సచివాలయ భవనం అసంపూర్తిగా మిగిలిందని, దీంతో పంచాయతీ పాలనకు ఆటంకంగా మారిందని గ్రామస్తులు చెబుతున్నారు. ఇదే గ్రామంలో గతంలో అప్పటి వైసిపి పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జి, జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ ఎంతో ఆర్భాటంగా బిసి కమ్యూనిటీ హాలు, స్థానిక బస్ షెల్టర్ నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. ఆ పనులు ఇప్పటికీ కార్యరూపం దాల్చకపోవడంతో గ్రామస్తులు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. సామాజికంగా ఎక్కువ శాతం బిసి కమ్యూనిటీ తరగతులు ఉన్న ఈ గ్రామంలో కమ్యూనిటీ హాలు నిర్మిస్తే స్థానికంగా సభలు సమావేశాలు జరుపుకోవడంతోపాటు చిన్నచిన్న శుభకార్యాలు, వివాహాలు కూడా చేసుకోవడానికి అన్ని వర్గాలకు అందుబాటులో ఉండే అవకాశం ఉంటుందని, కాని ప్రజాప్రతినిధులు సహకారం అందించడం లేదని పలువురు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు నిర్మించిన వారికే ఓట్లు వేస్తాం
అప్పారి కుమారస్వామి, గ్రామస్తుడు

కాంబొట్లపాలెం నుంచి పాలకొల్లు, దొడ్డిపట్ల రహదారిపై కనీసం మోటార్ సైకిల్ కూడా వెళ్లలేని అధ్వానంగా ఉంది. రహదారి మొత్తం భారీ గోతులమయం కావడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. రానున్న రోజుల్లో ఈ రహదారిని నిర్మించినవారికే ఓటు వేస్తాం.

గ్రామంపై వివక్ష చూపుతున్నారు
కేత నాగయ్య, గ్రామస్తుడు

మిగతా గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు తమ గ్రామంలో ఎక్కడా జరగడం లేదు. ఈ విషయంలో తమ గ్రామాన్ని ప్రజాప్రతినిధులు చిన్నచూపు చూస్తున్నారనే అనుమానం కలుగుతుంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ప్రధానంగా రహదారి సమస్యతో పాటు సచివాలయ భవన నిర్మాణానికి, బిసి కమ్యూనిటీ హాలు నిర్మాణానికి కృషి చేయాలి.

గ్రామాభివృద్ధికి సహకరించాలి
అనిశెట్టి మల్లిక, గ్రామ సర్పంచి, కాంబొట్లపాలెం



గ్రామాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో చాలా కష్టపడుతున్నాం. కాని గతంలో శంకుస్థాపన చేసిన కొన్ని ముఖ్య మైన పనులు కూడా పూర్తి చేయలేక పోతున్నాం. ప్రధానంగా రహదారి సమస్యతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందు లు ఎదుర్కొం టున్నారు. ఈ విషయాలను వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపీ దృష్టికి తీసుకెళ్లాం. ఆయన హయాంలోనైనా అభివృద్ధి పనులు జరుగుతాయనే ఆశతో ఉన్నాం.

ఆరోగ్యశ్రీ ఉన్నా డబ్బు వసూలు

పలు ఆసుపత్రుల నిర్వాకం
పేదలకు అందని ఉచిత వైద్యం

ప్రజాశక్తి - తణుకు రూరల్



APPLE HOSPITAL
(A Unit Of Tanuku Hospitals Ltd.)
Railway Station Road, Tanuku. Ph:08819-221113
Email:applehospitals@rediffmail.com
Advance Receipt

Pt. Name	TULASI MAHA LAKSHMI SIRIGISETTI		
IP No	UMR0156493	Admn No	IP0031446
Rcpt No	613947	Rcpt Dt	06-Dec-2023
Age/Sex	44Y(s)/Female	Phone	9393935581
S/O.D/O.W/O	PRABHAKAR RAO	Ward/Bed	GENERAL WARD/GWF-4
Consultant	Dr.D.V.S.RAMBABU	Dept. Name	UROLOGY
Advance NO	AD11664	Receipt Amt	5,000.00
Cheque Dt	06-DEC-2023	Cash Amt	0.00
Cheque Bank	BANK OF BARODA	Cheque No	8374
		Cheque Amt	5,000.00

Received with thanks from TULASI MAHA LAKSHMI SIRIGISETTI A Sum of Rs.5,000/-
In Words Five Thousand Rupees Only
Create By PRABHAKAR Create Dt 06-DEC-2023 02:20:33 PM
Print By PRABHAKAR Print Dt 06-Dec-2023 02:20:34 PM
(Authorised Signatory)

రూ.5 వేలు తీసుకున్నట్లు బిల్లు

ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు ఖరీదైన వైద్యసేవలను ఉచితంగా అందించాల్సి ఉన్నా కొన్ని ఆసుపత్రులు పేదల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నాయి. ఇలాంటి సంఘటనలు ప్రతి నిత్యం జరుగుతున్నప్పటికీ కొన్ని మాత్రమే బయట పడుతున్నాయి. తణుకు మండలం లోని తేతలి గ్రామానికి చెందిన ఎస్.తులసీమ హాలక్ష్మీ తెలిపిన వివరాల ప్రకారం... కిడ్నీలో రాళ్లు ఉన్నాయని గత నెల 22వ తేదీన తణుకు రైల్వేస్టేషన్ రోడ్డు లోని ఆపిల్ ఆసుపత్రిలో వైద్యులకు చూపించు కున్నారు. వైద్యులు రెండు సార్లు శస్త్రచికిత్సలు చేయాల్సి వస్తుందని తెలిపారు. రెండు శస్త్రచికిత్సలకు కలిపి మత్తు ఇచ్చేందుకు రూ.10 వేలు అవుతుందని తెలిపారు. దీంతో ఆమెకు తెలిసిన ఐఎంఎ వైద్యుని సలహాలు తీసుకోగా డబ్బులు ఏమీ ఇవ్వనవసరం లేకుండా నవంబరు 24వ తేదీన శస్త్ర చికిత్స చేశారు. రెండో సారి శస్త్రచికిత్స చేయించు చుకునే క్రమంలో మళ్లీ వైద్యుని సలహా మేరకు ఈ నెల ఆరో తేదీన ఆసుపత్రికి వెళ్లి వైద్యుడిని కలవగా రెండో వైపు మందులతో తగ్గిపో తుందని, శస్త్రచికిత్స చేయన వసరం లేదని చెప్పారు. మొదటి సారి చేసిన శస్త్రచికిత్సలో వేసిన ట్యూబును తీసేందుకు రూ.ఐదు వేలు ఇవ్వాలని అడిగారు. దీంతో చేసేది లేక రూ.ఐదు వేలు వైద్యు నికి చెల్లించి ఆ ట్యూబును తీయించుకున్నారు. ఆరోగ్యశ్రీ పేరే కాని డబ్బులు ఇవ్వకపోతే ఎవ్వరూ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ విషయంపై ఆసుపత్రి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ బ్రహ్మాజిని వివరణ కోరగా ట్యూబు తీయించు కునేందుకు ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ వార్డులో చేరాలని, అందుకు అప్రూవల్ మూడు రోజులు పడుతుం దని, ఆ కారణం చేతనే డబ్బులు తీసుకుని ట్యూబు తొలగిస్తు న్నామని తెలిపారు.

డబ్బులు వసూలు చేస్తున్నారు
ప్రభాకరరావు, తులసీమహాలక్ష్మి భర్త, తేతలి

నా భార్య శస్త్రచికిత్సకు మత్తు కోసం రూ.పది వేలు అడిగారు. ట్యూబు తొలగించి రూ.ఐదు తీసుకుని బిల్లు ఇచ్చారు. ఆరోగ్యశ్రీలో ఎవరికీ డబ్బులు ఇవ్వక్కర్లేదని ఒక పక్క ప్రభుత్వం చెబుతుంటే కొన్ని ఆసుపత్రుల్లో డబ్బులు వసూలు చేస్తున్నారు. ప్రభుత్వాలు ఆరోగ్యశ్రీని పటిష్టంగా అమలు చేస్తుంటే ఆసుపత్రి యాజమాన్యాలు ప్రదర్శిస్తున్న తీరు రోగుల్లో ఆరోగ్యశ్రీపై పలు అనుమానాలకు దారి తీసేవిధంగా ఉన్నాయి. పేద రోగులు డబ్బులు చెల్లించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ప్రతి రైతునూ ప్రభుత్వం ఆదుకుంటుంది

డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు

ప్రజాశక్తి - పాలకోడేరు

ఇటీవల సంభవించిన తుపాను వల్ల రైతులు చాలా నష్టపోయారని, అందరినీ ప్రభుత్వం ఆదుకుంటుందని డిసిసిబి ఛైర్మన్, వైసిపి ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహరాజు అన్నారు. మండలంలోని గొరగనమూడిపాలెం పెన్నాడ, విస్సాకోడేరు గ్రామాల్లో ముంపునకు గురైన వరి చేలను ఆయన శనివారం పరిశీలించారు. రైతులను ఎంపిపి చంటిరాజుతో కలిసి పరామర్శించారు. అనంతరం పివిఎల్ మాట్లాడుతూ ప్రతి రైతునూ ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. రైతులకు, కౌలు రైతులకు నెల రోజుల్లో ఇన్‌పుట్ రాయితీ అందించేందుకు సిఎం జగన్ అంగీకరించారన్నారు. ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. మండల వ్యవసాయాధికారి వి.నారాయణరావు మాట్లాడుతూ పూర్తిగా తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేయడానికి ప్రణాళిక రూపొందించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి భూపతిరాజు చంటిరాజు, సర్పంచులు భూపతి రాజు వంశీకృష్ణంరాజు, బొల్లా శ్రీనివాస్, గొట్టుముక్కల శివరామరాజు, వైస్ ఎంపిపి ఆదాడ లక్ష్మీతులసి, కందుల నాగరాజు, సామంతపూడి మారాజు (బాబు), సొసైటీ ఛైర్మన్ గడ్డం జోషి, దుండి అశోక్‌బాబు, చల్లబోయిన పాపారావు, మల్లుల శ్రీనివాస్, పంపన రామకృష్ణ, ఎంపిటిసి సభ్యులు బొల్లం గాంధీ, ఆరేపల్లి పెద్ద వెంకటస్వామి ఉన్నారు.

మహిళలను వేధిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

మహిళలను వేధిస్తే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎపి నిట్ డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ డాక్టర్ జిబి.వీరేష్‌కుమార్ హెచ్చరించారు. విద్యాసంస్థలోని మహిళా గ్రీవెన్స్ సెల్ ఆధ్వర్యంలో లైంగిక వేధింపుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం వాక్‌థాన్ (నడక) కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వీరేష్‌కుమార్ మాట్లాడుతూ మహిళలు పనిచేసేచోట ఎటువంటి వివక్షకు గురి కాకుండా వారికి రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చట్టం చేసిందన్నారు. మహిళలు గౌరవప్రదంగా పని చేసుకోవాలన్నదే ఈ చట్టం ముఖ్య ఉద్దేశమన్నారు. ఎవరైన వేధింపులకు గురైతే గ్రీవెన్స్ సెల్ దృష్టికి గాని, ఉన్నతాధికారుల దృష్టికి గాని తీసుకొస్తే వారిపై చర్యలు తీసుకుంటామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆచార్యులు, బోధన, భోదనేతర సిబ్బంది పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో కేసులు సత్వర పరిష్కారం

ప్రజాశక్తి - తణుకు రూరల్

లోక్ అదాలత్ ద్వారా కక్షిదారులిద్దరికీ సత్వర పరిష్కారం లభిస్తుందని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్, నాలుగో అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి అన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు శనివారం తణుకు కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్‌కు న్యాయమూర్తి సత్యవతి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెండింగ్ కేసుల పరిష్కారం కోసం న్యాయవ్యవస్థ లోక్ అదాలత్‌లను నిర్వహిస్తుందని తెలిపారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో 1216 కేసులను రాజీ చేశారు. ఐదు బెంచ్‌లుగా ఏర్పాటు చేసిన జాతీయ లోక్ అదాలత్‌లో సివిల్ కేసులు, క్రిమినల్ కేసులు, ప్రీలిటిగేషన్ కేసులు, బెంచ్ కోర్టు కేసులు రాజీ చేశారు. ఈ లోక్ అదాలత్‌లో నాలుగో అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి, సీనియర్ సివిల్ జడ్జి కె.కృష్ణసత్యలత, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పి.సాయిరాం, ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి పివిఎన్.రంజిత్‌కుమార్, ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఎవి.నాగరాజు, న్యాయవాదులు ఎం.సుబ్బయ్య, కె.మునిస్వామి, డిఎన్‌ఎస్.రెడ్డి, ఎస్‌కె.మోతీ, శ్రీనివాసరావు, అడిషినల్ ఎస్‌పి సుబ్బరాజు, డిఎస్‌పి శరత్‌రాజకుమార్, అడిషినల్ పిపి రంగాచార్యులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

పాఠశాల ఆవరణలో నీరు లేకుండా చర్యలు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - ఉండి

నీటిని బయటకు తోడుతున్న ఇంజన్

ఉండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిల్వ ఉన్న వర్షపు నీటిని ఇంజన్ల సహాయంతో బయటకు తోడారు. వర్షపు నీరు.. విద్యార్థుల అవస్థలు శీర్షికన శుక్రవారం ప్రజాశక్తిలో ప్రచురితమైన వార్తకు ఉండి పంచాయతీ సర్పంచి, పాలకవర్గం స్పందించింది. శనివారం నీటిని బయటకు తోడేందుకు చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఉండి సర్పంచి కమతం సౌజన్య బెనర్జీ, ఉప సర్పంచి గొట్టుముక్కల కల్యాణ్‌వర్మ మాట్లాడుతూ గ్రామంలో ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల పారిశుధ్య సమస్య ఏర్పడిందన్నారు. వాటిని పరిష్కరించడం తమ బాధ్యతని చెప్పారు. ఉండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వర్షపు నీరు నిల్వ ఉండి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనే విషయం పత్రికల ద్వారా తెలియడంతో వెంటనే ఇంజన్ల సహాయంతో నీటిని బయటకు పంపించే ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు.

పంట బోదెల ప్రక్షాళన

ప్రజాశక్తి - ఆచంట

తుపాన్ ప్రభావంతో పంట పొలాలు నేలకొరిగిన నేపథ్యంలో పంట బోదెల ప్రక్షాళన చేపడుతున్నట్లు వైసిపి గ్రామ ఇన్‌ఛార్జి మొల్లేటి రామకృష్ణ చెప్పారు. భీమలాపురం గ్రామంలో ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఆదేశాల మేరకు పంట చేలల్లో ఉన్న వర్షపు నీరు బయటకు వెళ్లేందుకు కాలువల్లో పేరుకుపోయిన మట్టిదిబ్బలు, పూడిక పనులను చేపట్టినట్లు తెలిపారు. ఎంఎల్‌ఎ శ్రీరంగనాథరాజు పరిశీలనకు వచ్చినప్పుడు నీట మునిగిన పంట పొలాలను కాపాడాలని రైతులు ఆయన వద్ద వేడుకోగా స్పందించి పంట బోదెల ప్రక్షాళన చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు ముడకల నానిబాబు, పి.శ్రీను పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రజాశక్తి - గణపవరం

పిప్పరలో మునిగిన వరి చేలను పరిశీలిస్తున్న గన్ని

తుపాన్ వల్ల నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని టిడిపి ఏలూరు జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు అన్నారు. మండలంలోని పిప్పర, కేశవరం గ్రామాల్లో వర్షాలకు మునిగిన పంట పొలాలను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడిసిన ధాన్యాన్ని తేమ శాతంతో సంబంధం లేకుండా కొనుగోలు చేయాలన్నారు. కేశవరంలో నీటిలో మునిగిన ప్రతి ఇంటి వద్దకు వెళ్లి వారి ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షులు ఇందుకూరి రామకృష్ణంరాజు, నాయకులు యాళ్ల సుబ్బారావు, టిడిపి, గణపవరం గ్రామ అధ్యక్షులు కూసంపూడి సురేంద్రరాజు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో నిబంధనలు సడలించామనడం అబద్ధం

పోడూరు :ధాన్యం కొనుగోలులో పూర్తిగా నిబంధనలు సడలించినట్లు సిఎం, మంత్రులు, అధికారులు చెప్పడం పచ్చి అబద్ధమని పాలకొల్లు ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు. మండలంలో తుపాను ప్రభావంతో ముంపు పాలైన వద్దిపర్రులో ఉన్న వరి పొలాలను, రంగు మారిన, తడిసిన ధాన్యం రాశులను రైతులతో కలిసి ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ రామానాయుడు మాట్లాడుతూ దెబ్బతిన్న వరి పంటను రైతు వద్ద గింజ మిగలకుండా కొనుగోలు చేసి ఆదుకుంటామని చెబుతున్న మాటలు క్షేత్రస్థాయిలో అమలు జరగడం లేదన్నారు. రైతులు ధాన్యాన్ని మిల్లులకు తీసుకెళ్తుంటే తేమశాతం నిబంధనల పేరుతో కేజీలు ఇవ్వండి, లేదా డబ్బులు కట్టండి, లేకపోతే ఎండబెట్టి తీసుకురండని చెబుతున్నారని చెప్పారు. ముంపు ప్రాంతాల్లో సిఎం జగన్ పర్యటన వల్ల ఎటువంటి ఉపయోగం లేదన్నారు. రైతులను ప్రభుత్వం ప్రకటనలతో మోసం చేస్తుందన్నారు. ఎంఎల్‌ఎతో పాటు పార్టీ మండలాధ్యక్షుడు గొట్టుముక్కల సూర్యనారాయణరాజు, పెన్మత్స రామభద్రరాజు, ఎంపిటిసి సభ్యులు విప్పర్తి శారద, శీలం శ్రీనివాస్, కండెల్లి శ్రీనివాస్, కె.ప్రసాద్, జి.ప్రసాద్, నాగరాజు కృష్ణంరాజు, రామకృష్ణంరాజు పాల్గొన్నారు.

ఉజ్వల యోజన పథకాన్ని వినియోగించుకోండి

పాలకోడేరు : ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం కింద అర్హులైన మహిళలకు గ్యాస్ సిలిండర్, స్టవ్ ఉచితంగా అందిస్తుందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు అన్నారు. విస్సాకోడేరులో 160 మందికి శనివారం ఉచితంగా గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.లక్ష లోపు ఆదాయం ఉఉన్న వారు, అంతకు ముందు గ్యాస్ కనెక్షన్ లేని వారు వీటిని పొందవచ్చున్నారు. దీనికి సంబంధించిన యాప్ ఓపెన్ చేస్తే దరఖాస్తు ఫారం వస్తుందని, అది పూర్తి చేసి గ్యాస్ ఏజెన్సీలో ఇస్తే మంజూరు చేస్తారన్నారు. రేషన్‌కార్డ్, బ్యాంక్ ఖాతా నెంబర్, ఫోన్ నెంబర్ ఇవ్వాలన్నారు. ఈ కనెక్షన్ పొందిన వారికి 400 రాయితీ సిలిండర్‌పై వస్తుందని తెలిపారు.

మంత్రి రోజాకు పాలకొల్లులో ఘన స్వాగతం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు క్షీర రామలింగేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా లక్ష దీపారాధన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టూరిజం శాఖ మంత్రి రోజా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమెకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపీ, యడ్ల తాతాజీ, ఆలయ ఛైర్మన్ కోరాడ శ్రీనివాస్, ఇఒ యర్ర సూర్యనారాయణ, ప్రముఖులు ఆమెకు స్వాగతం పలికారు.

లోక్ అదాలత్‌లో 1056 కేసులు పరిష్కారం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

మండల న్యాయసేవాధికార ఆధ్వర్యంలో కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 1056 కేసులు పరిష్కరించినట్లు భీమవరం మండల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, మూడో అదనపు జిల్లా న్యాయమూర్తి పి.సత్యాదేవి తెలిపారు. కక్షిదారు, న్యాయవాదులు సహకరిస్తేనే త్వరితగతిన న్యాయం జరుగుతుందన్నారు. ప్యానల్ లాయర్స్ పారా లీగల్ వాలంటీర్లు, మీడియా సహకరించడం వల్లే ఈ సారి ఎక్కువ కేసులు రాజీ చేసినట్లు తెలిపారు. లోక్ అదాలత్‌లో మొత్తం 1056 కేసులను ఉభయ పార్టీల కోరిక మేరకు రాజీ చేసినట్లు తెలిపారు.

16, 17 తేదీల్లో అంతర్జాతీయ తెలుగు ఉత్సవాలు

ప్రజాశక్తి - ఆకివీడు

తెలుగు అభ్యుదయ కవి, ఉపాధ్యాయుడు వెంకి విజయకుమార్‌కు తాడేపల్లిగూడెం శ్రీశ్రీ కళావేదిక నిర్వహించే అంతర్జాతీయ తెలుగు ఉత్సవాల్లో పాల్గొనాలని ఆహ్వానం అందింది. ఈ నెల 16, 17 తేదీల్లో ఈ సంస్థ ఉత్సవాలు నిర్వహిస్తోంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తెలుగు సాహిత్యం, కళలు, సాంస్కృతిక రంగాల్లో అత్యున్నత స్థాయి వ్యక్తులను ఈ సంస్థ గౌరవించి వారి సాహిత్యాన్ని సమాజానికి అందిస్తూ ఉంటుంది. ఈ సంస్థ నిర్వహించే కార్యక్రమంలో కవితా పఠనం చేయాలని వెంకికి ఆహ్వానం అందింది. ఇప్పటికే విజయ్‌కుమార్ శతక కర్తగా, రంగస్థలం నటుడుగా అనేక పురస్కారాలు అందుకున్నారు.

పాస్‌పోర్టు పోయినది

RAMANI SRIDEVI అను నాకు విశాఖపట్నం పాస్‌పోర్టు కార్యాలయం అధికారులు ది.15-02-2017న P7891499 నెంబరు గల పాస్‌పోర్టు మంజూరుచేసారు. సదరు పాస్‌పోర్టు జిరాక్స్ కాపీలు తీయించుకునేందుకు ది.30-11-2023 న కాళీపట్నం పడమర గ్రామం నుండి నరసాపురం పట్టణంకు వెళ్లుండగా నా ఒరిజినల్ పాస్‌పోర్టు పోయినది. గాన, నా పాస్‌పోర్టు ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది చిరునామాకు అందించగలరని కోరుతు న్నాను.

RAMANI SRIDEVI
W/o. Ramani srinu
D.No. 1-24, Pallipalem, Kalipatnam West,
Mogaltur Mandal, West Godavari Dist, A.P.

దస్తావేజు పోయినది

పులిగడ్డ రాంబాబు, తండ్రి: రంగారావు గల నా యొక్క దస్తావేజు పోయినది. పెనుగొండ ఇంటి నుండి జిరాక్స్ సెంటర్‌కు వెళుతుండగా నా యొక్క దస్తావేజు పడిపోయినది. దస్తావేజు నెంబర్ 2474/2001 గల దస్తావేజు ఎవరికైన దొరికిన యెడల ఈక్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

అడ్రస్: పులిగెడ్డ రాంబాబు
తండ్రి: రంగారావు
పెనుగొండ, పెనుగొండ మండలం
పశ్చిమగోదావరి జిల్లా, పిన్: 534320
సెల్: 9494762684

మహారాజశ్రీ 1వ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో, తణుకు
O.S. 442/2020

Between:
విజయ బ్యాంక్, ప్రస్తుతం బ్యాంక్ ఆఫ్ బరోడా, Rep. by its మేనేజర్, తణుకు. -వాది
మరియు
1. తోలేటి పెద నరసింహారావు, S/o. వెంకట్రాయ్య, డో.నెం. 22-5-105, బంగారు చెరువు గట్టు, పాలకొల్లు.
2. తోలేటి మంగతాయారు, W/o. పెద నరసింహారావు, డో.నెం. 22-5-105, బంగారు చెరువు గట్టు, పాలకొల్లు.
3. వేముల అశ్వనికుమార్, S/o. భాస్కరరావు, శ్రీనగర్ కాలనీ, పాలకొల్లు. -ప్రతివాదులు

ప్రకటన

పై నెంబరు గ్రంధములో ప్రతివాదులన మీ ముగ్గురికి ఎన్నిసార్లు సమన్లు పంపినప్పటికిన్నీ అమలు జరుగనందున శ్రీ కోర్టు వారు Substituted Service by way of Paper Publication ఉత్తర్వులు వేసియున్నారు. పై నెంబరు గ్రంధము ది. 12-12-2023వ తేదీకి వాయిదా అయివున్నది. కావున మీరు ముగ్గురు సదరు తేదీన శ్రీ కోర్టు వారి ఎదుట ఉదయం 10 గం॥ 30 ని॥లకు స్వయముగా గాని, లేక మీ యొక్క ప్లీడరు గారి ద్వారా హాజరు అయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనిచో సదరు గ్రంధము మీ యొక్క పరోక్షములో తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులతో)

తణుకు ఓ.ఎన్.కృష్ణ, అడ్వకేట్
08-12-23 తణుకు, సెల్:9848199440

NUZVID MUNICIPALITY

Sl. No.	Name of Work
1	Nuzvid Municipality would like to appoint 3rd party Quality assurance agency for conduction quality control tests for works. Sale of Tender schedule start date - Dt. 11-12-2023 Last date for Submission Dt. 14-12-2023 Opening of Technical bid - Dt. 14-12-2023 Cost of Tender Schedule - Rs. 1000/- The Commissioner, Nuzvid Municipality reserves all rights to cancel/ reject/ postpone/ fixup any special conditions.

Sd/- COMMISSIONER
Nuzvid Municipality